# పునీత

సరిగ్గా అప్పుడు సాయంత్రం ఆరు గంటల పైన పదిహేను నిముషాలయింది. పగలంతా తన ప్రతాపాన్ని చూపి అందర్నీ కాల్చుకు తిన్న సూర్యుడు తను ఇక ఆ తాపాన్ని భరించలేనట్లుగా పడమటి కొండల వెనగ్గా వున్న ఎర్ర చందనపు కొలనులోకి దూకేస్తున్నాడు.

ఆ వీధిలో ముప్పయి యిళ్లు వున్నాయి. యిళ్లన్నీ శుభ్రంగా రంగులతో వెల్లి విరుస్తున్నాయి. ఆ వీధి మధ్యగా వేసిన నల్లని తారు రోడ్డు... రోడ్డు పక్కగా మునిసిపాలిటీ వారి దీపాలు... అక్కడక్కడా ఆగివున్న కార్లు, స్కూటర్లు ఆ వీధికి హుందాతనాన్ని చేకూరుస్తున్నాయి.

మధ్య తరగతి మనిషి సంసారంలా గుంభనగా వున్నది ఆ వీధి.

సుశీల తన ఇంటి ముందు గది కిటికీ పక్కగా నిల్చొని శూన్యంలోకి చూస్తున్నట్లుగా రోడ్డు మీదకు చూస్తున్నది. అప్పుడప్పుడే కనుమరుగౌతున్న సూర్యుడి స్థానే సుశీల ముఖం మీద ఎర్రటి కుంకుమ బొట్టు వింత తేజస్సుతో వెలిగి పోతున్నది.

ఆమె గులాబీ రంగు చీర మీద అదే రంగు జాకెట్టు వేసుకున్నది. తలంటి పోసుకున్న జుట్టును పిక్కల దాకా జారవిడిచి ఆ పైన గులాబీ రంగు రబ్బరు బ్యాండు వేసుకున్నది. చెవులకు జూకాలు పెట్టుకున్నది. పచ్చటిమెడ రంగులో కలిసిపోయేలా కనబడీ కనబడకుండా ఒంటిపేట గొలుసు, కళ్లను మరింత సాగదీస్తూ కాటుక, పెదవులు ముదురు ఎరుపు రంగులో నీటితో తడిసి వున్నట్లున మెరుపు...

వంగి చీర కుచ్చెళ్లు సరిచేసుకుంటూ కిటికీలోనుంచి బయటకు చూస్తున్నది సుశీల.

సాంబు సైకిల్ మీద వచ్చాడు హడావుడిగా.

పైట సర్దుకుంటూ దగ్గరకు వేసివున్న తలుపు తీసి 'ఏమిటి?' అన్నట్లుగా అతడి వంక చూసింది.

"మధుసూధనంగారు రాత్రి తొమ్మిది గంటలకు వస్తానన్నారు అక్కా!" అన్నాడు. "వారి స్నేహితులెవరో ఢిల్లీ నుంచి వచ్చారట!"

"సరే!" అన్నది సుశీల.

"నేను రెండో ఆట సినిమాకు వెళతానక్కా... హోటల్లో భోజనం చేసేదా?"

"వాళ్ల కేమన్నా కావాలంటేనో?"

"చెప్పారు... నేను అన్నీ తెచ్చి ఇచ్చే వెళతాను!"

మధుసూధనం స్వయంగా ఎవరినో తీసుకు వస్తున్నాడూ అంటే అతడు పెద్ద పార్టీయే అయివుండాలి.

"సరే... ఇవిగో... ఈ ఇరవై తీసుకు వెళ్లు!" అన్నది లోపల టేబుల్ మీద పడేసి వున్న డబ్బాలోనుంచి రెండు పదులు తెచ్చి అతడికిస్తూ.

సాంబు వచ్చినంత హడావుడిగానే వెళ్లిపోయాడు.

తలుపు వేసి బోల్టు పెట్టింది.

సాయింత్రం అయిదింటికే అన్నం వండేసింది. పొద్దున వండిన కూర, పప్పు ఫ్రిజ్‌లో వుండనే వున్నాయి. ఓ గిన్నెలో చారు పడేసింది. ఎనిమిదింటికల్లా భోజనం చేస్తే సరిపోతుంది అనుకున్నది.

హాల్లోకి వెళ్లి ఫ్రిజ్ తెరిచి ఎర్రటి యాపిల్‌ను బయటకు తీసింది. ముదురు రంగులో ఇంపుగా చల్లగా వున్నది అది. వంటయింట్లోకి వెళ్ళి పక్కగా వున్న స్టాండులోనుంచి స్టెయిన్‌లెస్ స్టీలు కత్తి తీసుకున్నది. ముందు గదిలోకి వచ్చి కుడివైపుగా వున్న కిటికీ తలుపులు తీసింది.

సరిగ్గా అప్పుడే పక్కింటి పోర్టికోలో నిలబడి వున్న పదేళ్ల చంద్రం కనబడ్డాడు. నిల్చొని రోడ్డు మీద వున్న తన ఈడు కుర్రవాడితో ఏదో మాట్లాడుతున్నాడు.

చంద్రాన్ని చూడగానే సుశీల కళ్లు తళుక్కున మెరిసినయి. ఆమె పెదవులు అల్లల్లాడినయి 'తమ్ముడూ' అన్నట్లుగా.

అతడిని చూస్తుంటే తన ఊళ్లో- చెరువు కట్ట పక్కన పెంకుటింటి వాకిట్లో బాదం చెట్టు క్రింద ఆడుకుంటున్న తమ్ముడు గుర్తుకు వచ్చాడు. మరుక్షణంలోనే అమ్మ గుర్తుకు వచ్చింది. నాన్న గుర్తుకు వచ్చాడు. చెల్లెలు గుర్తుకు వచ్చింది. తన జీవితాన్ని ఇలా చేసిన ఆ త్రాష్టుడు గుర్తుకు వచ్చాడు.

కనుగుడ్లు తడుస్తున్నాయి. వాటిని రెప్పలు పొడి చేస్తున్నట్లుగా అల్లల్లాడుతున్నాయి. త్రాష్టుడిని శపిస్తున్నట్లుగా పెదవులు వంకర్లు తిరుగుతున్నాయి. కసిక్కిన తన కసినంతా అతడి మీదే చూపిస్తున్నట్లుగా కత్తితో యాపిల్‌ను రెండు ముక్కలుచేసింది. ఒక ముక్కను తీసుకొని రెండు పళ్లమధ్యాపెట్టి- వాడు చావాలి అన్నట్లుగా-పెద్దగా శబ్దం అయ్యేలా కొరికి నమలసాగింది.

చంద్రాన్నే చూస్తున్నది.

తన వాళ్లని తను మరోసారి జీవితంలో చూడగలుగుతుందా?

రోడ్డు మీద నిల్చుని మాట్లాడుతున్న చంద్రం స్నేహితుడు వెళ్లిపోయాడు.

తను ఈ వీధిలోకి వచ్చి రెండు నెలలయింది. వచ్చిననాడే చూచింది- అతడిని చూచినప్పుడల్లా తమ్ముడే గుర్తుకు వస్తున్నాడు. అదే పొడుగు... అదే లావు... అదే రంగు... తన తమ్ముడిలాగానే ఇతడూ నల్లటి ఒత్తయిన జుట్టును పైకి దువ్వుతాడు.

కిటికీలోనుండి అతడినే కన్నార్పకుండా చూస్తున్నది- అతడు తన వైపుకు ఎప్పుడు చూస్తాడా అన్నంత ఆబగా!

ఆమె కోరిక తీరుస్తున్నట్లుగా తన చూపుల్ని సుశీల నిలుచున్న కిటికీ వైపుకు తిప్పాడు చంద్రం. తననే చూస్తున్న ఆమెను విచిత్రంగా చూడసాగాడు. తను ఎప్పుడు కనబడినా ఎందుకామె అలా తనని గుచ్చిగుచ్చి చూస్తుంటుందో అతడికి అర్థం కాలేదు.

అంతేగాదు చిన్నగా నవ్వుతుంది. చేయెత్తి సున్నితంగా వేళ్లను కదిలిస్తూ తనని పిలుస్తున్నట్లుగా ఊపుతుంది. ఆమె అలా తన చేతి వేళ్లను ఊపుతుండగానే అతడూ నవ్వు ముఖంతో చేయెత్తి అటూయిటూ కదిలిస్తాడు కనబడీ కనబడనట్లుగా.

సుశీల అతడికి సగం కోసిన యాపిల్ చూపిస్తూ, "రా తమ్ముడూ!" అంటూ చిన్నగా పిలిచింది.

అతడు 'వద్దు' అన్నట్లు మొహమాటంగా, సిగ్గుగా నవ్వాడు.

సరిగ్గా అతడు అలా నవ్వుతున్నప్పుడే వాళ్ల వాకిలి తలుపు తెరుచుకున్నది. అందులోనుండి వాళ్లమ్మ బయటకు వస్తూనే పోర్టికోలో నిలుచుని నవ్వు ముఖంతో పక్కింటి వైపుకు చూస్తూ చేయూపుతున్న కొడుకును చూసింది. ఆమె ముఖాన్ని చిట్లిస్తూ చికాగ్గా అటువైపుకు చూసింది- అక్కడ కిటికీ వెనగ్గా నిలబడి నవ్వుతూ తన కొడుకు వంకే చూస్తున్న సుశీలను చూసింది.

ఆమె ముఖం కోపంతో కందిపోయింది. కళ్లు ఎర్రచేసి ఆమెను మసిచేయాలి అన్నట్లుగా అటువైపుకు తీక్షణంగా చూస్తూ కొడుకు రెక్కపుచ్చుకొని బరబరా లోపలికి లాక్కు వెళ్లింది. తలుపును పెద్దగా శబ్దమయ్యేలా మూసి కొడుకు వీపు మీద, సుశీల మీద కోపాన్నంతా కుమ్మరిస్తున్నట్లుగా, దబదబా బాదింది. చంద్రం బావురుమన్నాడు.

తల్లి లాక్కు వెళుతుండగా తన వంకే బేలగా చూస్తున్న ఆ పిల్లవాడిని చూస్తుంటే సుశీల మొఖం నల్లబడిపోయింది. పెదవులు మరింత పలచబడి అవమానంతో పాలిపోయి తెల్లబడిపోయినయి.

బాధతో ముఖం పక్కకు తిప్పుకొని, చేతిలోని యాపిల్ ముక్కను తలుపు పక్కగా వున్న చెత్త వేసే ప్లాస్టిక్ బుట్టలోకి విసిరి వేసింది.

పడకగదిలోకి వెళ్లి ఫోమ్‌బెడ్ మీద బోర్లాపడిపోయి- గుండెల్లోని బరువును ఇక మోయలేనట్లుగా భోరుమని ఏడవసాగింది.

వెధవ బ్రతుకు!

⁘ ⁘ ⁘

ఉదయం పదకొండు గంటలు. చలికాలం ఎండ గూడా మండిపోతున్నది. రాత్రి ఓ పాపిష్టివాడి చేతిలో నలిగి పోయిన శరీరాన్ని గీజర్‌లో సలసలా కాగిన నీళ్లతో తడిపి, సున్నిపిండేసి రుద్ది, ఆపైన సబ్బేసి కడిగి, మెత్తటి టర్కీటవల్‌తో తుడిచి, గంధంలా పవిత్రమైన వాసన వస్తున్న పాండ్స్ పౌడర్‌ను వళ్లంతా పట్టించి, గులాబీ రంగు నైటీతో శరీరాన్ని కప్పుకొని, స్టౌ వెలిగించి అన్నం వండేటందుకు కాసిని బియ్యం పడేద్దాం అనుకుంటుండగా, కిటికీలోనుంచి చూచిన ఆమెకు పక్కింటి పోర్టికోలో స్టాండు వేసివున్న స్కూటర్ మీద కూర్చొని పుస్తకం చదువుకుంటున్న చంద్రం కనబడ్డాడు.

ఆమె కళ్లు చందనంతో చల్లబడ్డట్లుగా హాయిగా విశాలమయినయి. రెప్పలు ఆనందంతో చప్పట్లు కొట్టినట్లుగా టపటపలాడినయి.

కిటికీ దగ్గరకు వెళ్లి అతడినే చూస్తూ తన ఊరును, తన తమ్ముణ్ణి, తన తల్లిని, తన తండ్రిని, తన చెల్లెల్ని, తన గత జీవితంలోని మాధుర్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ- విచ్చుకున్న పెదవుల నడుమ మంచి ముత్యాల్లా మెరిసే పళ్లు ఎర్రటి చిగుళ్లతోసహా కనబడేలా నవ్వుతూ చేయూపింది.

అతడు భయం భయంగా మెడ తిప్పి వాళ్లింటి వాకిటి వైపుకు చూచాడు- అమ్మ ఎక్కడ వున్నదో అన్నట్లుగా. అక్కడ ఎవ్వరూ లేకపోవటంతో ధైర్యంగా అతడూ నవ్వాడు.

ఆలస్యం చేయకుండా చటుక్కున సుశీల ఫ్రిజ్ తెరిచి స్వీట్ ప్యాకెట్‌ను బయటకు తీసి, పక్క తలుపు తెరిచింది.

"రా తమ్ముడూ!" రెండిళ్లనూ వేరు చేస్తున్నట్లుగా వున్న ఆ చిన్న గోడ దగ్గర నిలబడి పిలిచింది.

అతడు 'ఉహూ' అంటూ రానన్నట్లుగా తల ఊపాడు. ఆమెను చూచినప్పుడల్లా అతడికి తన తల్లి వీపు మీద బాదే దెబ్బలు గుర్తుకు వస్తాయి. తల్లి గుర్తుకు రాగానే భయంతో ముఖం ముడుచుకుపోతుంది.

"ఇదుగో ఈ స్వీట్ ప్యాకెట్ తీసుకో!"

"వద్దు!"

"అక్క ఇస్తే తమ్ముడు వద్దు అనగూడదు!" అన్నది స్వీట్ ప్యాకెట్ వున్న చేతిని ముందుకు జాస్తూ.

అతడికి అప్పుడప్పుడూ ఆమె అంటే జాలివేస్తుంది. వట్టిపుణ్యానికి ఆమెను తిట్టే అమ్మంటే కోపమొస్తుంది. అమ్మ- ఎప్పుడూ తనను నవ్వుతూ పలకరిస్తుండె ఆమెను- ఎందుకు తిడుతుంటుందో అర్థం కాదు!

అతడు భయం భయంగా తెరిచివున్న వాళ్ళ తలుపు వంక మరోసారి చూచాడు. ఆ గదిలో ఎవ్వరూ వున్న అలికిడి లేకపోవడంతో స్కూటరు దిగి గోడదాకా వచ్చి ఆ ప్యాకెట్ అందుకున్నాడు.

"థాంక్స్!"

"మా యింటికి రాకూడదూ?"

అతడు భయంగా ఆమె ముఖంలోకి చూచాడు.

ఇంకా తను అక్కడే వుంటే వాళ్ల అమ్మ చూచి అరుస్తుందేమోనన్నట్లుగా- చేతిలో తనిచ్చిన స్వీటు ప్యాకెట్టును పట్టుకొని ఎదురుగ్గా నిల్చున్న అతడిని ఒక్కసారి తృప్తిగా చూచి- వెనక్కు తిరిగి మెట్లెక్కి గదిలోకి వెళ్లిపోయి తలుపులు వేసుకున్నది సుశీల.

వేదనాభరితమైన ఆమె గుండెను మంచు బిందువులు క్రమ్మివేసినట్లుగా వున్నది ఆ క్షణాన.

తన వాళ్లతోటే మాట్లాడినంత తృప్తిగా సాయంత్రం దాకా గడిపి- షాపింగ్‌కు వెళ్లేటందుకు బయటకు వచ్చిన ఆమె- గేటు దాటుతూ- తుపాకీ గుండు తగిలిన మనిషిలా గిలగిల లాడిపోయింది.

అక్కడ గేటు పక్కగా వున్న చెత్త కుండీలో తను పొద్దున చంద్రానికిచ్చిన స్వీటు ప్యాకెట్ పడేసి వున్నది. దాని చుట్టూ అందులోని స్వీట్స్ చెల్లాచెదురుగా పడివున్నాయి!

* * *

వారం రోజుల తరువాత ఓ రోజు సాయంత్రం అయిదు గంటలప్పుడు మేడమీద ఉతికి ఆరవేసిన గుడ్డలు తెచ్చుకునేటందుకు వెళ్లిన సుశీల పక్కింటి వైపుకు చూచింది.

కిటికీలోనుంచి తనవైపుకే చూస్తున్న చంద్రం కనబడ్డాడు. ఆమె కళ్లు తళుక్కున మెరిసినయి ఆనందంతో.

నాలుగు రోజులబట్టీ అటు ఎన్నిసార్లు చూచినా అతడు కనబడలేదు. అప్పుడు- ఆ క్షణాన అతడు కనబడటంతో ఆమె ముఖం ఆనందంతో విశాలమయింది. పెదాలు విడదీసీ విడదీయకుండా చిన్నగా నవ్వుతూ చేయెత్తి ఊపింది.

అతడూ నవ్వాడు. కానీ పేలవంగా వున్నదా నవ్వు. ముఖం నల్లబడి పీక్కుపోయినట్లుగా వున్నది. జిడ్డుగారుతూ దిగులుగా వున్నది. ఆ కళ్లల్లో మెరుపు లేదు. ఆ నవ్వులో జీవం లేదు. ఆ ముఖంలో కళలేదు.

ఆత్రంగా- ఏమైందీ అన్నట్లుగా అతడి వంక చూస్తూ- వాళ్ల వాకిటి వైపుకు తల తిప్పింది. అది తాళం వేసి వున్నది. అర్థం కాలేదు ఆమెకు. చటుక్కున అతడి వైపుకు తిరిగి, "ఏం చేస్తున్నావ్ ఒక్కడివే?" అన్నది ఆదుర్దాగా.

అతడు నీరసంగా ఆమెనే చూస్తున్నాడు.

"నాకు జ్వరమొచ్చి రాత్రే తగ్గింది... మా అమ్మా, నాన్నా, అక్క అంతా పెళ్లికి వెళ్లారు... నేను వస్తే అక్కడ అన్నీ తింటానంటానని నన్ను ఇంట్లో వుంచి తాళంవేసి వెళ్లారు... ఓ గంటలో వచ్చేస్తారు!" అన్నాడు.

"మా యింటికి రారాదు... యాపిల్ కోసి పెడతా!" అన్నది జాలిగా అతడినే చూస్తూ.

"వద్దు... అమ్మ కొడుతుంది!"

ఆమె గుండెల్లో బాకు దిగినంతగా గిలగిలలాడింది. నోటివెంట మాటరాక కొన్ని క్షణాలు అలాగే వుండిపోయింది

"ఇప్పుడు లేరుగా... వచ్చేయ్!" అన్నది లోగొంతుకతో. "రెండు ముక్కలు తినేసి వెళుదువుగాని!"

అతడు వస్తే తను ఒళ్లోకూర్చోపెట్టుకొని తన తమ్ముడిని, అమ్మని, నాన్నని, చెల్లెలిని చూచినంతగా తృప్తిపడాలని ఆమె ఆశ.

"పక్క తలుపు తీసుకురానా?" అన్నాడు నీరసంగా.

"రా!" అన్నది ఆనందంగా.

"మా అమ్మకు చెప్పొద్దు... నన్ను రెండునిముషాలల్లో పంపేయాలి!"– ఆ కళ్లల్లోని భయం అంత దూరాన వున్న ఆమెకు స్పష్టంగా కనబడింది.

ఆమె మనస్సు కుతకుతలాడిపోయింది.

"నేను ఎవ్వరికీ చెప్పను... వెంటనే పంపిస్తాను నిన్ను!"

ఆమె త్వరత్వరగా క్రిందకు వెళ్లి వాకిటి తలుపు తెరిచింది. కర్టెన్‌ను పక్కకు నెట్టింది. గేటు ఘడియ తీసింది. ఆత్రంగా అతడి రాక కోసం ఎదురు చూస్తూ నిలబడిందక్కడ. గేటు మీద వున్న ఆమె చేతి వేళ్లు ఉద్వేగంతో వణుకుతున్నాయి. అతడు ఎప్పుడు వస్తాడా– అతడి చేయి పట్టుకొని లోపలకు ...సుకు వెళ్లి– ఆత్మీయంగా ఎప్పుడు ముద్దు పెట్టుకోవాలా అన్నంత ఆవేశంగా ఆమె గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయి.

పక్కింటి పక్క తలుపు తీసిన శబ్దమయింది.

మెడ తిప్పి అటువైపుకు చూచింది సుశీల.

అతడు ఆ గదిలోనుంచి బయటకు వచ్చి తలుపును దగ్గరకు వేశాడు. సందులోనుంచి గేటు దగ్గరకు వచ్చాడు. గేటు తీసుకొని బయటకు వచ్చి మళ్ళా దానిని మూశాడు.

ఆమె ఆనందంగా రెండడుగులు బయటకు వేసింది.

"రా! తమ్ముడూ!"

అతడు సిగ్గుగా నవ్వి తల వంచుకున్నాడు. ఆమె పక్కనే నడుస్తున్నాడు... ఆమె పట్టుకున్న తన చేతిని విడిపించు కోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆమె అతడిని తీసుకొని లోపలకువచ్చి గేటు మూసింది. మెట్లెక్కి ముందు వరండాలోకి వచ్చింది. కర్టెన్‌వేస్తూ అతడిని తన రెండు చేతులలోకి- తన వాళ్లనందరినీ దగ్గరకు తీసుకుంటున్నంత ఆబగా- తీసుకోబోయింది.

అతడి మూసి వున్న కుడిచేతి గుప్పిట చూచి ఆమె అడిగింది నవ్వుతూ, "ఏమిటది?" అంది.

"డబ్బులు... మా అమ్మ ఒత్తుల డబ్బాలోనుంచి తెచ్చాను!"

"దేనికి?"

"మీ యింటికి వస్తే డబ్బులివ్వాలిట గదా!... మావాళ్లు అనుకుంటుంటే విన్నాను!"

✣ ✣ ✣

గేటు చప్పుడవ్వగా విసురుగా వెళ్లి తలుపు తీసింది సుశీల.

తీసుకున్న గేటులోనుంచి సైకిల్‌మీదే లోపలకు వచ్చాడు సాంబు. ఒక కాలును మెట్టుమీద పెట్టి సైకిల్ మీదే కూర్చున్నాడు.

"ఆయన రాత్రి పదకొండు గంటల బస్సుకు అర్జంటుగా విజయవాడ వెళ్లిపోవాలిట... పెందరాళే వస్తానన్నారు ... తయారుగా వుండు!" అన్నాడు.

అతడికి వింతగా వున్నది ఆ క్షణాన ఆమె రూపం చూస్తుంటే. ఆమెను ఎప్పుడూ అతడు అలా చూడలేదు.

జుట్టంతా రేగి వున్నది. ముఖమంతా నల్లగా జిడ్డు కారుతున్నది. ఏడ్చిందన్నందుకు నిదర్శనంగా కళ్ళు ఉబ్బి ఎర్రగా వున్నాయి. చెంపలు తడిసి, తల వెంట్రుకలు అంటుకొని అసహ్యంగా వున్నాయి. చీర నలిగి వున్నది. ఆమె ఏదో మైకంలో వున్నట్లుగా రెప్పలు సగం మూసుకొని అతడినే నీరసంగా చూస్తున్నది.

ఆమె పెట్టుకున్న రూపాయంత బొట్టు అతడికి మూడో నేత్రంలా కనిపించగా కాస్త జంకుతో సైకిల్ మీదనుండి క్రిందకు దిగాడు.

ఆమె గిరుక్కున వెనక్కు తిరిగి లోపలకు వెళ్లి క్షణాల్లో బయటకు వచ్చింది.

చేతిలో వున్న డబ్బును అతడికిస్తూ, "ఆయన్ను రావద్దని చెప్పు... మధుసూధనంగారికి గూడా చెప్పు ఇంకెవ్వరినీ పంపవద్దని... ఆ సుశీల చచ్చిపోయిందని చెప్పు... నేను ఈ ఊరు వదిలి వెళ్లిపోతున్నానని చెప్పు!" అంది.

ఆమె ఈ మనుష్యులనీ, ఈ వెలుగునీ ఇక చూడలేనట్లుగా, గదిలోకి ఒక్కదూకు దూకి తలుపులు భళ్లున మూసి వేసుకున్నది.

అప్పుడు -

సూర్యుడు అస్తమించేటందుకు పడమరకు జేరుకొని రక్తాన్ని చిమ్ముతున్నట్లుగా ఆకాశానికి ఎర్రటి రంగు పులిమేస్తున్నాడు!

*(రచన: ఫిబ్రవరి, 1999)*